

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 6 సంచిక : 10 పుష్యం : 29-31 05-05-2001

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 12
VOL : 6 ISSUE : 10

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 140/-**
Each Copy : **Rs. 10/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278

## ఆత్మ కరతలామలకమా!

కాదు, అంతకంటే తేలిక అంటున్నారు భగవాన్. కరతలామలకం అవటానికి అమలకం అనే కాయ, దానిని పట్టుకోవడానికి చెయ్యి, కాయను చూడటానికి కన్ను, దాని వెనకాల నేత్రేంద్రియము, మనస్సు ఇన్ని కావాలి. ఇన్ని ఉంటే కాని కరతలామలకం అవ్వదు. ఆత్మవిద్యకు అవేవీ అక్కరలేదు. విషయాసక్తి, ఆకర్షణలు తగ్గినప్పడు మనం, మనస్స్వరూపమైన నిశ్చల వస్తువుతో ఏకమౌతాము. ఈ నిశ్చలవస్తువైన ఆత్మ స్వయంజ్యోతి కనుక దానిని తెలుసుకోవటానికి ఏ ఉపకరణములు, ఉపాధులు అక్కరలేదు. అందుచేత ఆత్మవిద్య అతి సులభము.

ఈ సంచికలో..............

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**

19-2-2001 గణపవరం .................... 2
20-2-2001 పడమర విప్పర్రు .................... 5
22-4-2001 జిన్నూరు .................... 8

**దేహాభిమానం బలిచేస్తే మనకు ఆత్మనిష్ఠకలిగి, మన ద్వారా లోకానికి మేలు జరుగుతుంది**

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-2-2001, గణపవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మహాత్ములను, మహర్షులను దర్శించటం వలన జ్ఞానం యొక్క విలువ నీకు తెలుస్తుంది, జ్ఞానం పొందాలనే కాంక్ష హృదయాంతరాళములనుండి వస్తుంది. నీకు ఆత్మనిష్ఠ కలిగితే నీద్వారా లోకానికి మేలు జరుగుతుంది, నీద్వారా అనేకమంది చైతన్యస్థాయిని పెంచుకొంటారు. చైతన్యానుభవం పొందటంకోసం, ఆత్మానుభవం పొందటంకోసం నీ దేహాభిమానాన్ని బలిచేయవలసిందే, ఆత్మానుభవం కావాలనుకొన్నప్పుడు దేహాభిమానాన్ని కాదని అనవలసిందే, అదీ కావాలి, ఇదీ కావాలి అంటే సాధ్యం కాదు. నీ దేహాభిమానాన్ని త్యాగం చేయలేవు అనుకో ఆత్మానుభవం నీకు అందదు, ఎంతసమీపంగా ఉన్నా అది నీకు అందదు. మహాత్ములను దర్శించటం వలన హృదయంయొక్క లోతులు పెరుగుతాయి. హృదయం యొక్క లోయలలోనికి వెళ్ళేకొలది ఆత్మముత్యం నీకు దొరుకుతుంది. అప్పుడు రాకపోకలతో నీకు పనిలేదు. ఆత్మ అంతటా ఉంది కాబట్టి నీవు కూడా విశాలమైపోతావు, ఆకాశం ఎంత విశాలంగా ఉందో అంత విశాలమయిపోతావు. నిప్ప దగ్గరకు వెళ్ళేకొలది వేడి ఎలా తెలుస్తూ ఉంటుందో అలాగ ఆత్మవైపుకు వెళ్ళేకొలది దానితాలుక సుఖం, శాంతి, ఆనందం మనకు తెలుస్తూ ఉంటుంది. గుడిలో దేవుడిని చూడటం ఎందుకంటే, అలా చూడగా చూడగా లోకం అంతా దేవుడిని చూసే అవకాశం వస్తుంది. లోకంఅంతా దేవుడిని చూస్తూ ఉంటే నీకు మోహం ఎక్కడుంది. మోహం ఉన్నవాడికి కోరికలు గాని మోహంలేనివాడికి కోరికలు లేవు. లోకం అంతా దేవుడిగా చూసినప్పుడు మనకు ద్వైతబుద్ధి నశిస్తుంది. ద్వైతబుద్ధి నశించిన మరుక్షణంలో అద్వైతానందం నీకు కలుగుతుంది, అప్పుడు ఇంక నీకు పునర్జన్మలు లేవు.

మనస్సు బయటకు వస్తే అశాంతి, లోపలకు వెళితే శాంతి. దానిని ఎటుపంపాలి అనేది నీ చేతిలో ఉంది. మనస్సు బయటకు వస్తే ఎలాగ ఉంటుంది అని అడుగుతున్నారు. మనస్సు బయటకు వస్తే లోకంలోని విషయములతో తాదాత్మ్యం పొందుతుంది, నీవు ఏదైతే కాదో దానితో తాదాత్మ్యం పొందుతుంది, పూర్వం నీకు ఉన్న అలవాట్లయొక్క వేగంలో కలిసిపోతుంది. బయటకు వెళ్ళే మనస్సుకు జ్ఞానం రాదు. అంతర్ముఖమైన మనస్సుకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం లేకుండా హృదయంలో ఉన్న సద్వస్తువు నీకు అందదు. ప్రపంచంలో ఏ వస్తువులోను శాంతిలేదు. శాంతి నీ హృదయంలోనే ఉంది. నీవు ఇంట్లో ఉన్నా, గుడిలో కూర్చొన్నా, సమాజంలో ఉన్నా నీ శరీరం ఎక్కడ ఉంది

అనేది ప్రధానం కాదు, నీ మనస్సు ఈశ్వరుడి స్థానమైన హృదయం వైపుకు ఎంతవరకు జరుగుతోందో అది చూసుకోవాలి. మందు మ్రింగటం వలన నీ జ్వరం ఎంతవరకు తగ్గుతోందో చూసుకోవాలి. నాకు జ్వరం తగ్గకపోయినా ఫరవాలేదు మందులు మ్రింగుతాను అంటే ఆ మాటకు అర్థంలేదు. లోకజ్వరం, మోహజ్వరం తగ్గటానికి మనస్సును హృదయంలోనికి పంపవలసిందే. దేహానికి సంబంధించిన అనుబంధం కాదు, గురువుతో మానసికఅనుబంధం ఉండాలి. అప్పుడు గురువు నిన్ను పరమ పవిత్రుడిని చేస్తాడు. నీకు విశ్రాంతి కావాలంటే నీ మనస్సును హృదయంలో నిలబెట్టినప్పుడు మాత్రమే నీకు నిజమైన విశ్రాంతి కలుగుతుంది. అభ్యాసం ఎంతకాలం చేయాలి, ధ్యానం ఎంతకాలం చేయాలి అని అడుగుతున్నారు. మీరు రోజూ వంట చేసుకొంటున్నారు, అన్నం తింటున్నారు. ఇలా ఎంతకాలం తినమంటారు అని ఎవరైనా అడుగుతున్నారా? లేదు. అభ్యాసం ఎంతకాలం చేయాలి అని అడుగుతున్నారు. అన్నం తినమని ఎవరూ నీకు చెప్పనక్కరలేదు. అభ్యాసం చేసుకోండి అని నీకు ఎవరో చెప్పాలా? ఎవరో చెపితే చేసింది ఎంతకాలం నిలబడుతుంది. రోజూ అన్నం ఎలాగ తింటున్నావో, స్నానం ఎలా చేస్తున్నావో అంత సహజంగా నీ మనస్సును హృదయంలో నిలబెట్టే అభ్యాసం చేయాలి. అది కృత్రిమంగాకాదు, సహజంగా చేయాలి. ఏ వస్తువును అయితే పొందుదామని అనుకొంటున్నావో ఆ వస్తువును సహజంగా ప్రేమించే కొలది ఆ వస్తువు నీకు వేరుగా కాదు, నేనుగానే నీకు వ్యక్తమవుతుంది. రోడ్డు ప్రక్కన ఉన్న మురికిగుంటలకంటే నీ మనస్సులో ఉన్న మురికిగుంటలు ప్రమాదకరమైనవి. వాటివలన నీ శరీరానికి అనారోగ్యం రావచ్చుకాని మనస్సులోఉన్న మురికిగుంటలవలన నీవు నీచాతి నీచమైన జన్మలలోనికి వెళ్ళవలసి ఉంటుంది. నీ మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచటం వలన మనస్సులో ఉన్న మురికిగుంటలు నీకు తెలియకుండానే రాలిపోతాయి. అప్పుడు నీ మనస్సు నిర్మలమవుతుంది, నీ మనస్సు శుద్ధి అవుతుంది. నీవు ఏమార్గంలో ప్రయాణంచేసినా, ఏగురువును ఆశ్రయించినా అంతఃకరణ శుద్ధి అవ్వకుండా నీవు మోక్షసామ్రాజ్యానికి అధిపతివి అవ్వలేవు.

మాకు చాలా డబ్బు ఉంది, గౌరవం ఉంది. మనస్సుకు శాంతిలేకపోతే ఏమౌతుంది అనేవారు ఎవరైనా ఉన్నారా? ఎవరూ లేరు. అందరికీ శాంతి కావాలి. నీ హృదయంలో ఉన్నశాంతితో సమానమైనది ఈ సృష్టిలో ఏదీలేదు. మనస్సును హృదయంలో ఎక్కువగా ఉంచటంవలన, దానికి సాధనాబలం పెరుగుతూ ఉంటే ఆత్మానుబలం కలగటానికి ఏ విషయాలయితే నీకు ఆటంకంగా ఉన్నాయో ఏ విషయాలయితే నిన్ను ఇబ్బంది పెడుతున్నాయో వాటికి శక్తి తగ్గిపోతుంది, అలవాట్లయొక్క వేగం తగ్గిపోతుంది. వాటి వేగం తగ్గిపోయిన తరువాత అవి నెమ్మదిగా రాలిపోతాయి. ఇది మొదట కష్టంగా అనిపించినా అభ్యాసం చేసే

కొలది అవి పోతాయి. నీ చివరిశ్వాసవరకు అభ్యాసము, వైరాగ్యములను విడిచిపెట్టవద్దు అని భగవంతుడు చెప్పాడు. వైరాగ్యం మనస్సును బాహ్యముఖానికి వెళ్ళకుండా ఆపుచేస్తుంది. అభ్యాసం వలన మనస్సు హృదయంలో నిలబడి ఉంటుంది. ఏ జన్మలో అయినా నీ హృదయం ఖాళీ అవ్వకుండా ఎవరికీ ఆత్మజ్ఞానం కలుగదు. దానిని ఖాళీ చేసుకోవటం గదిని ఖాళీచేసినంత తేలికకాదు. ఈశ్వరానుగ్రహం లేకుండా హృదయం ఖాళీ అవ్వదు. ఆత్మయొక్క వైభవం, ఆత్మయొక్క సౌందర్యం జీవుడికి ఏమి తెలుస్తుంది. సూర్యుడు ఉదయించాక చీకటి పోతుంది, అది ఉండాలన్నా ఉండలేదు. అలాగే ఆత్మయొక్క వెలుగులో ఆ మహావెలుగులో భ్రమ అనే చీకటి, మోహమనే చీకటి పూర్తిగా కరిగిపోతుంది, ఉండాలన్నా అది ఉండలేదు.

వాసనలు పూర్తిగా వేరుతో సహా నశించాక వస్తువు నీకు ప్రత్యక్షంగా అనుభవంలోనికి వస్తుంది. వస్తువు అనుభవంలోనికి వచ్చాక నమ్మకాలతో పనిలేదు. ఎందుచేతనంటే అది ప్రత్యక్షానుభవం. వాసనలు పూర్తిగా నశించకపోతే హృదయంలోఉన్న వస్తువు నీకు కొంత తెలుస్తూ ఉంటుంది అనుకో అప్పుడు నీకు అనుభూతి కలుగదు. పూర్తిగా వాసనా నాశనం అయిన తరువాత అరచేతిలో ఉన్న వస్తువు నీకు ఎంత స్పష్టంగా గోచరిస్తుందో నీ హృదయంలో ఉన్న వస్తువు అంత స్పష్టంగా నీకు గోచరిస్తుంది. వాసన మూలంతో సహా నశించేవరకూ నీకు జ్ఞానం స్థిరపడదు. కొద్దిగా శేషం ఉన్నా లాభం లేదు వాసనలు నిశ్శేషంగా నశించాలి. దీనికి సహనం, పట్టుదల ఉండాలి. గది తుడిస్తే గదిపోదు గదిలో ఉన్న దుమ్ము పోతుంది. నీవు సాధన చేస్తూ ఉంటే నీవు ఎక్కడికి వెళ్ళవు, నీవు ఏదైతే కాదో అది పోతుంది, నీవు ఏదిగా ఉన్నావో అది మిగులుతుంది. ఆత్మను వెతుకుచున్నాను, ఆత్మ నాకు ఇంకా దొరకలేదు అని ఒక భక్తుడు భగవాన్‌తో అన్నాడు. అసలు అది ఎప్పుడైనా పోతేకదా నీవు వెతుక్కోవటానికి. ఉన్న వస్తువును ఎవరూ వెతుక్కోరు. నిజంగా అది పోలేదు నీ తలంపులో పోయింది. అది పోయిందనే తలంపును పోగొట్టుకో ఉన్నది ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది, నీవు ఆత్మగా మిగిలిపోతావు అన్నారు భగవాన్. నీవు సాధన చేస్తూ ఉంటే సాధనాబలం వలన, ఈశ్వరానుగ్రహం వలన వాసనలు నెమ్మదిగా పోతాయి. మీరు ప్రయత్నం మానకండి. రోజూ సాధనచేయటమే పనా అని అడుగుతున్నారు. సత్యాన్వేషణలో ఉన్నప్పుడు నీవు సాధన చేయకుండా ఉండలేవు. కొంతదూరం వెళ్ళాక నీవు సాధన చేద్దామన్నా చేసేవాడు అక్కడ ఉండడు. అప్పుడు నేను సాధన చేయమన్నా నీవు సాధన చేయలేవు ఎందుచేతనంటే చేసేవాడు అక్కడ ఉండడు. నిర్మలంగా సాధన చేసుకొంటూ వెళ్ళిపోండి. తొందరపడవద్దు, సాధనవిడిచిపెట్టవద్దు. మీ సాధనా ఫలితం మీకు ఇచ్చేస్తాడు, ఆయనకు అక్కరలేదు. భగవంతుడు కర్మఫల దాత.

# మనం దేనికోసం వెదుకుతున్నామో అదే మనము

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-2-2001, పడమర విప్పర్రు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఏ వస్తువు కోసం నీవు అన్వేషణ చేస్తున్నావో అది నీ హృదయంలోనే ఉంది. నువ్వు సంపాదించుకోవలసింది ఏదీ లేదు, వదిలించుకోవలసిందే ఉంది. నీ దేహంతోటి, మనస్సుతోటి నీకుఉన్నతాదాత్మ్యం వదిలించుకోవటమే నీ సాధన యొక్క ప్రయోజనం. వాటిని వదిలించుకొంటే ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. స్వర్గరాజ్యం నీ హృదయంలోనే ఉంది. ఆ ప్రాంగణంలో నీవు ప్రవేశించాలి. అక్కడ ప్రవేశించటానికి ఇతరులు ఎవరూ నీకు అడ్డురావటం లేదు, నీ మనస్సే అడ్డువస్తోంది. తలంపును పట్టించుకోకపోతే మనస్సు హృదయంలో ఉంటుంది, తలంపును పట్టించుకొంటే మనస్సు హృదయంలోనుండి బయటకు వచ్చేస్తుంది అసలు తలంపు ఎందుకురావాలి? నీలోపల వాసన ఉంది, వాసనలో నుండి తలంపు వస్తోంది. వాసన ఎక్కడనుండి వస్తుంది అంటే పూర్వజన్మలో మనం చేసిన కర్మను బట్టి వస్తుంది. మనం ఏదో పనిచేస్తాము. ఫలితం వస్తుంది. దానిని మనం ఎంజాయ్ చేస్తాము. ఎంజాయ్ చేసినప్పుడు వాసన పుడుతుంది. ఆ వాసనలోనుండి తలంపు వస్తుంది, ఆ తలంపును బట్టి తిరిగి మనం పనిచేస్తాయి. ఇది కర్మచక్రం. మనం ఖంతో కొంత ప్రయత్నం చేస్తేగాని, ఈశ్వరానుగ్రహం ఉంటేగాని ఈ చక్రంలోనుండి బయటకు రాలేము.

నామరూపములతో నిమిత్తం లేకుండా మీకు, నాకు ఈ పంచభూతాలకు, ఈ సృష్టికి అంతా ఆధారంగా ఒక సద్వస్తువు ఉంది: దానినే సత్యం అంటున్నాము. ఎంతకాలం అయితే సత్యం నీకు అనుభవంలోనికి రాదో అంతకాలం నీకు స్వేచ్ఛ లేదు, సుఖం లేదు, శాంతి లేదు. అది అనుభవంలోనికి వచ్చేవరకూ మనం శవాలను మోస్తూ ఉండవలసిందే. చేతులతో పూజ చేస్తాము, నోటితో జపం చేస్తాము, మనస్సుతో ధ్యానం చేస్తాము ఇవి అన్నీ మనస్సును నియమించటానికి, మనస్సును పరిశుద్ధం చేయటానికే. మనస్సు పరిశుద్ధం కాకపోతే దానికి అంతర్దృష్టి కలుగదు. అంతర్దృష్టి కలుగకపోతే ఆత్మజ్ఞానం కలిగే అవకాశం లేదు. పరిశుద్దం కాని మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. పరిశుద్ధమైన మనస్సుకు లోచూపు కలుగుతుంది, హృదయం యొక్క లోయలలోనికి ప్రవేశిస్తుంది. గాఢ నిద్రలో మనం సుఖంగా ఉన్నాము, శాంతిగా ఉన్నాము కాని ఎరుకలేదు, జాగ్రదవస్థలో ఎరుక ఉంది గాని సుఖంలేదు. గాఢనిద్రలో

ఉన్న సుఖం, జాగ్రదవస్థలోఉన్న ఎరుక రెండూ ఒకేసారి మనకు అనుభవంలోనికి వస్తే అదే మోక్షం. ఈమోక్షస్థితిని పొందటానికి మనశరీరాలు చనిపోయే వరకూ ఆగనక్కరలేదు. మనోనాశనానికి ఎవరూ ఇష్టపడటంలేదు ఎందుచేతనంటే అదే మనం అనుకొంటున్నాము. మనస్సు నశిస్తే మనం నశిస్తాము అనుకొంటున్నాము కాబట్టి మనో నాశనానికి ఎవరూ ప్రయత్నం చేయటం లేదు. మనస్సు నశిస్తే నీవు నశించవు, నీవు ఎవరోనీకు తెలుస్తుంది అని శాస్త్రం చెపుతోంది ఇది మనం గ్రహించాలి. గదిని తుడిస్తే దుమ్ము పోతుంది, శుభ్రత మిగులుతుంది. అలాగే నీలో ఉన్న అజ్ఞానాన్ని తుడిచివేస్తే మిగిలేది చైతన్యమే. దానికి చావులేదు, పుట్టుకలేదు. మిగులుతుంది. అలాగే నీలో ఉన్న అజ్ఞానాన్ని తుడిచివేస్తే మిగిలేది చైతన్యమే. దానికి చావులేదు, పుట్టుకలేదు. ఇప్పుడు నీకు శరీరంతో ఎలా తాదాప్యం ఉందో అలాగ చావులేనివస్తువుతో నీకు తాదాప్యం వచ్చింది అనుకో అప్పడు నీ శరీరం చనిపోతున్నా నీవు చనిపోవటం లేదు అని నీకు తెలుస్తుంది. శరీరం మరణించే రోజుకైనా మరణంలేని వస్తువుతో నీకు తాదాప్యం వస్తే ఇంక నీకు పునర్జన్మ లేదు. వైరాగ్యం అనే కత్తితో దేహాభిమానాన్ని ఎవడైతే నరుకుతున్నాడో వాడికే సత్యదర్శనం అవుతుంది. మనకు అకారణ భక్తి ఉండాలి. భక్తి ఉండాలి కాని దానికి కారణం కనబడకూడదు. అకారణభక్తి వలన ఆత్మజ్ఞానం కలుగుతుంది.

నీకు ఏ కారణం వలన దుఃఖం వచ్చినా లోపల అజ్ఞానం ఉన్నట్లు గుర్తు. జ్ఞానం లేకుండా నీవు భగవదనుభవం పొందలేవు. నీవు ఎవరోనీవు మర్చిపోయావు అందువలన నీవు అమృతత్వానికి దూరమయ్యావు. నిన్ను నీవు చూసుకొని లోకాన్ని చూడు అప్పడు అంతా బ్రహ్మమే, నీకు ఆనందమే మిగులుతుంది. మనలో ఉన్న బలహీనతలను తొలగించుకోవటానికే ఈ భూమి మీదకు వచ్చాము. మీ బట్టమీద పురుగు పాకుతోంది అంటే తీసేసుకొంటారు మీకు కోపం రాదు. మీరు సారామానేయండి అని చెపితే మీకు కోపం వస్తుంది. ఎందుచేతనంటే ఆ పురుగుతోటి మీకు తాదాప్యం లేదు. మీకు ఉన్న అలవాటుతో మీకు తాదాప్యం ఉంది, అదే మీరు అనుకొంటున్నారు. దానిని తొలగించుకోమని చెపితే మీకు కోపం వస్తోంది. మీరు ఆత్మకానిదానిని ఆత్మ అనుకొంటున్నారు, సత్యం కానిదానిని సత్యం అనుకొంటున్నారు. ఈ అనుకోవటం వదిలేస్తే చాలు, నీ సాధన అక్కడే గురిపెట్టు. అందరికి జ్ఞానం సంపాదించాలని ఉంది కాని సంపాదించటం చాలా కష్టంగా ఉంది. దానికి నీకు ఎవరూ అడ్డురావటంలేదు, నీకు నీవే అడ్డు వస్తున్నావు. అడ్డువచ్చేదానిని తీసి ఒక

ప్రక్కన పెట్టు అప్పుడు నీకు అమృతానుభవం కలుగుతుంది. ఆత్మ సూక్ష్మాతిసూక్ష్మమైనది అని పేజీలు పేజీలు వర్ణించి ఆత్మగురించి వేదం చెపుతుంది. అది చదివినంత మాత్రంచేత ఆత్మనీకు తెలియదు. అది మాటకు, మనస్సుకు అందదు. అది నీకు ఎప్పుడు తెలుస్తుంది అంటే నీవు ఆత్మగా ఉంటే అది నీకు తెలుస్తుంది. నీవు నామరూపాలను దాటలేకపోతున్నావు ఇంకనీకు జ్ఞానం ఏమిటి? పరిమితమైన వాటిని విడిచిపెట్టకపోతే పరిమితం లేనిది నీకు ఎలా అనుభవంలోనికి వస్తుంది. వంద సంవత్సరాలు వచ్చిన వాడికి కామక్రోధాలు తగ్గుతాయి గాని కీర్తికాంక్ష పోదు. కీర్తి కాంక్షలోపలకు వెళ్లనివ్వదు. అదికూడా ఒక అవరోధము. జన్మజన్మలనుండి మనం ఒక అలవాటును అంటిపెట్టుకొని ఉన్నాము. ఆ అలవాటును విడిచిపెట్టటం వలన నీకు జ్ఞానం కలుగుతుంది. వ్యక్తిభావనను ఎవడైతే త్యాగం చేసాడోవాడు ఆత్మలో స్థిరపడతాడు. నీవు ఏమీ ఊహించనక్కరలేదు, భావించనక్కరలేదు. ఈ తలంపులు అన్నీ అహంభావనలో నుండి వస్తాయి. వీటిని అతిక్రమించిన వాడికి జ్ఞానం కలుగుతుంది.

జన్మలు వస్తూ ఉంటాయి, పోతూఉంటాయి. మూడుఅవస్థలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. కాని నీవు దైవచింతన విడిచిపెట్టవద్దు, దైవభావన విడిచిపెట్టవద్దు. దైవాన్ని ఆరాధించగా, ఆరాధించగా ఆ దైవమే నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. నీవు సరియైన మార్గంలో ప్రయాణించు. ఈనాటికైనా, ముందునాటికైనా భగవంతుడు నీకు అనుభవంలోనికి వస్తాడు. దేవుడు చెప్పేమాట దేవుడు హృదయమ్మై ఉన్నది, అది ఎక్కడ నుండి వస్తుంది అంటే హృదయంలో నుండి వస్తుంది. అజ్ఞాని హృదయం నాలుకమీద ఉంటుంది. జ్ఞాని నాలుక హృదయంలో ఉంటుంది. దేవుని మాటయందు నీకు గౌరవం లేనప్పడు నీవు దేవుడు ఎలా అవుతావు, దేవుడి హృదయంలోనీకు చోటు ఎలా ఇస్తాడు. నేను ఉన్నాను అనేది ఆత్మ. అది అన్ని అవస్థలలోను ఉంది, అన్ని కాలాలలోను ఉంది. అసహజంగా జీవించే నీకు సహజంగా ఉన్న వస్తువు ఎలా వ్యక్తమవుతుంది. ఆత్మ వచ్చేదీ, పోయేదీ కాదు. ఎప్పడూ ఉండేదే ఆత్మ, అదే నీవు. నీవుకానిదానిని నీవు అనుకొంటున్నావు. అది కూడా తలంపే. ఆతలంపును విడిచి పెట్టగలిగితే నీలో ఉన్న నిజం నీకు వ్యక్తమవుతుంది.

# చిత్తశుద్ధి కలిగినపుడు రాగద్వేషములు నశిస్తాయి

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 22-4-2001, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఎవరైనా సబ్జక్టు చెపుతూ ఉంటే వినాలి. ఆ మాటలు మన జీవితానికి ఉపయోగపడతాయి అనుకొంటే వాటిని తీసుకోవాలి, ఉపయోగపడని వాక్యాలు వదిలి వేయాలి. నాకు సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా నిగ్రహించుకోలేకపోతున్నాను అని అడుగుతున్నారు. సంతోషం ఒక తలంపు, దుఃఖం ఒక తలంపు. కొన్ని రోజులు సుఖంగా వెళ్ళిపోతాయి, కొన్ని రోజులు దుఃఖంగా ఉంటుంది. అవి పూర్వజన్మలో చేసిన ఖర్మనుబట్టి ఎదురవుతాయి. పూర్వజన్మలో చేసిన పుణ్యం సుఖరూపంలో వస్తుంది, పూర్వజన్మలో చేసిన పాపం దుఃఖరూపంలో వస్తుంది. ఈ సుఖము శాశ్వతంగా ఉండదు, దుఃఖం శాశ్వతంగా ఉండదు. రెండూ వెళ్ళిపోతాయి. నీకు సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా, గౌరవం వచ్చినా, అగౌరవం వచ్చినా అన్నీ కొట్టుకొనిపోతాయి. అవి అలాగే ఉంటాయి అని అనుకోవద్దు. సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా దానిని ఇముడ్చుకోవాలి. అలా ఇముడ్చుకొనే శక్తి లేకపోతే మనస్సుకు లోచూపు కలుగదు. మీరు పుణ్యకార్యాలు చేసినా, పాపకార్యాలు చేసినా వాటికి ఫలితం వస్తుంది. కాని అవి ఏమీ ఉండేవి కాదు, ఉండేది చైతన్యం ఒక్కటే.

నారదుడు అంటే కలహప్రియుడు అని చాలామంది అనుకొంటారు. నరుడిని నారయణునిలో కలిపేవాడు నారదుడు. కాని చాలామంది అపార్ధం చేసుకొంటారు. ఎప్పడైనా ఆయన మాటలు కలహానికి దారితీసినా, గమ్యం మటుకు ఒక మంచిని దృష్టిలో పెట్టుకొని చెపుతాడు. నారదుడు ఒకమహర్షి అని మనం మర్చిపోకూడదు. ధృవుడిని పినతల్లి అగౌరవపరుస్తుంది. పినతల్లి గురించి తల్లితో చెపితే, అరణ్యాలకు వెళ్ళి తపస్సు చేసుకోమని తల్లి ధృవుడికి చెపుతుంది. ధృవుడు తపస్సు చేసుకోవటానికి వెళుతూఉంటే నారదుడు ఎదురవుతాడు. ఎక్కడికి వెళుతున్నావు అని నారదుడు ధృవుడిని అడుగుతాడు. నా పినతల్లి చేసిన అవమానం భరించలేక తపస్సుకు వెళుతున్నాను అని చెపుతాడు. అప్పడు నారదుడు ధృవుడితో ప్రతీ మనిషికి పూర్వజన్మలో వాడు చేసిన పనులనుబట్టి గౌరవం, అగౌరవం, సుఖం, దుఃఖం వస్తూ ఉంటాయి. ఇప్పడు నీకు అగౌరవం వచ్చింది కాబట్టి బాధపడుతున్నావు. కాని భవిష్యత్‌లో నీకు గౌరవం రావచ్చు. అగౌరవం వస్తే అలాగే ఉండి పోతుంది అనుకోకు. దాని వెనకాల గౌరవం వస్తుంది. గౌరవం, అగౌరవం రెండూ భరించాలి. కాని ఇవి రెండూ శాశ్వతం కాదు అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి అని చెపుతాడు. నీవు చెప్పిన మాటలు అన్నీ వదిలేసిన సాధువులకు బాగుంటాయి, నాలో ఇంకా క్షత్రియ రక్తం ఉంది. నీవు చెప్పినది అసత్యం అని నేను అనటంలేదు, సత్యం అయి ఉండవచ్చు అంటాడు ధృవుడు. నీకు దేహాభిమానం ఉంది కాబట్టి పినతల్లి అన్న మాటలు నీకు బాణాలుగా తగులుతున్నాయి,

దేహాభిమానం లేనివాడిని ఆ మాటలు ఏమి చేస్తాయి అంటాడు నారదుడు. అందువలననే కదా నేను తపస్సు చేయటానికి వెళుతున్నాను అని ధృవుడు చెపుతాడు. అప్పుడు నారదుడు మంత్రాన్ని ఉపదేశిస్తాడు, ఆ మంత్రాన్ని చేసి ధృవుడు తరిస్తాడు. ధృవుడికి నారాయణుడు ప్రత్యక్షమై నీకు ఏమికావాలి అంటే నాకు ఏమీ అక్కరలేదు మోక్షం మాత్రమే కావాలి అని కోరుకొంటాడు. తపస్సు చేయటం వలన పినతల్లి చేసిన అవమానాలు అన్నీ మర్చిపోయాడు అంటే తపస్సు వలన పవిత్రుడు అయ్యాడు. ఈ లోకంలో భోగం అనుభవిస్తావు, పరలోకంలో నీవు పొందవలసినది పొందుతావు అని నారాయణుడు చెపుతాడు. నీవు దర్శనం ఇచ్చాక ఇంక నాకు భోగకాంక్ష ఏమి ఉంటుంది అంటాడు ధృవుడు. నీకు లేదు కాని నేను ఇస్తున్నాను కాబట్టి అనుభవించు అంటాడు భగవంతుడు. అంటే మనం అనుభవించవలసి ఉంటే తప్పదు అది మనం గ్రహించాలి. భోగం అనుభవించటం వలన నీవు మాయలో పడిపోతావని అనుకోనక్కర లేదు ఎందుచేతనంటే నీ కోరిక వలన నీవు భోగం అనుభవించటం లేదు, నేను ఇస్తున్నాను కాబట్టి అనుభవించు. నీవు పొందవలసిన పరమస్థితిని పొందుతావు అని భగవంతుడు చెప్పాడు. నీ హృదయంలో ఏ వాసన ఉందో నీకు తెలియకపోవచ్చు, భగవంతుడికి తెలుసు. ధృవుడికి ఎంతోకొంత రాజ్యకాంక్ష ఉండి ఉండవచ్చు కాబట్టి నారాయణుడు రాజ్యాన్ని అనుభవించు అని చెప్పాడు. వాడు భగవంతుడు అంటే మనం అరుణాచలంలో ఉండి జిన్నూరును స్మరించుకోవటం కంటే, జిన్నూరులో ఉండి అరుణాచలాన్ని స్మరించుకోవటం మంచిది ఎందుకంటే మాలిన్యం శరీరంలో లేదు, మనస్సులో ఉంది. దేహం బాగుంటే, అందంగా ఉంటే మోక్షం రాదు. ఎవడికైతే ఉత్తమ స్వభావం ఉందో వాడికి మోక్షం వస్తుంది. ఇష్ట దేవతను మనస్సుతో నిరంతరం స్మరించటం వలన మనస్సులో ఉన్న మాలిన్యం పోతుంది. మనస్సులో ఉన్న మాలిన్యం పోతే పునర్జన్మ రాదు. పునర్జన్మ కారణములు మనస్సులో ఉన్నాయి. ఆమనస్సులో భగంతుడిని స్మరించగా స్మరించగా మనస్సులో ఉన్న మాలిన్యం పోతుంది, మనస్సు పరిశుద్ధమవుతుంది. దేహం ఎక్కడ ఉన్నా ఇబ్బంది లేదు, భగవంతుడితో మానసిక అనుబంధం పెట్టుకోవాలి.

నీకు సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా మనస్సు బాహ్య ముఖానికి వచ్చేస్తుంది. నీ లోపల ఉన్న గుణాలు నిన్ను ధ్యానం చేయనివ్వవు. తమోగుణం, రజోగుణం ఉంటే నిన్ను ధ్యానం చేయనివ్వవు, సత్వగుణం ఉంటే ధ్యానం సాగుతుంది. ఎవరైనా మాట చెపుతున్నప్పుడు శ్రద్ధగా ఆ మాట వినవచ్చు. కాని ఆ మాట కరెక్టుగా లేనప్పుడు ఆ ప్రవాహంలో కొట్టుకొనిపోకూడదు. అప్పుడు మనకు వివేకం అవసరం. మన జీవితంలో అస్తమించే సమయం వచ్చింది ఇంకా ఈ సుఖాన్ని, దుఃఖాన్ని తట్టుకోవటం ఈ గొడవలు ఎందుకు అని అనుకోకండి. ఇప్పుడైనా సాధన ప్రారంభించండి. వయసు అయిపోయింది, చనిపోయే సమయం వచ్చేసింది ఇంక సాధన ఎందుకు అని అనుకోవద్దు. ఇప్పుడైనా సాధన మొదలుపెట్టు. రాబోయే జన్మలో

ఈ సాధన అంతా ఉపయోగపడుతుంది. సంతోషాన్ని, దుఃఖాన్ని నీవు సమానంగా తీసుకొంటున్నావు అనుకో మనో నిగ్రహం సంపాదించావు అనుకో దాని వలన నీకు తెలియకుండానే నెమ్మదిగా, నెమ్మదిగా మహా వెలుగులోనికి జారిపోతావు. మాటలు అనటం తేలిక, పడటం అంటే భరించటం చాలా కష్టం. పడ్డవారికి దేవుని అనుగ్రహం వస్తుంది. పుస్తకంలో పెట్టుకోవటం కంటే మెదడులో పెట్టుకోవటం మంచిది. జేబులో మందు ఉండటం కంటే దానిని లోపలకు వేసుకోవటం వలన మందు పని చేస్తుంది. అలాగే మంచి మాటలను పుస్తకంలో వ్రాసుకోవటం మంచిదే కాని దానిని మననం చేసి మెదడులో పెట్టుకొంటే అవి పనిచేయటం ప్రారంభిస్తాయి. చేసే స్నేహాల విషయంలో, చదివే పుస్తకాల విషయంలో సాధకులు బహుజాగ్రత్తగా ఉండాలి. అన్నీ కావాలనుకొనే వారికి ఏదీరాదు, ఏదీవద్దు అనుకొనేవాడికి అన్నీ వస్తాయి. రాగద్వేషములు తగ్గించుకొంటే చిత్తశుద్ధి కలుగుతుంది. దైనందిన జీవితంలో మన వ్యవహారం చిత్తశుద్ధి కలగటానికి సహకరించాలి. మనలను చిన్న మాట అంటే కోపం వచ్చేస్తుంది. వేడి వచ్చేస్తుంది అంటే మనకు సాధనాబలం లేదని అర్థం. ప్రహ్లాదుడు శరీరంమీద అగ్నివేస్తే చల్లగా ఉంది అంటాడు. భగవంతునియందు సజీవమైన విశ్వాసం ఉంటే, ఆయనతో మానసిక అనుబంధం ఉంటే ఆయన రక్షణ ఎప్పడూ ఉంటుంది. మహాభారతంలో పాండవుల జీవితంలో ఎన్నో ఘట్టాలు ఉన్నాయి. పాండవులు అరణ్యవాసంలో ఉన్నా, రాజ్యంలోఉన్నా , ఎక్కడ ఉన్నా కృష్ణుడితో మానసిక అనుబంధం ఎప్పడూ విడిచిపెట్టలేదు. పాండవులు తెలియక చేసిన తప్పలనుండి వారిని పరమాత్మ కాపాడాడు. ఎందుకు కాపాడాడు అంటే వారు తెలియక చేసారు అంతేగాని వారి లోపల ఉన్న భక్తిలో దోషం లేదు ఇది గ్రహించండి. పాండవులు అరణ్యవాసంలో ఉన్నప్పడు రోమమహర్షి ఆశ్రమంలో ఒక చెట్టుయొక్క కాయలను కొట్టారు. ఆ చెట్టుయొక్క పండు తిన్న వారికి వారు ఎంతకాలం జీవిస్తే అంతకాలం ఆకలి, దాహం ఉండదు. కాని షరతు ఏమిటంటే కాయ దానిఅంతట అది రాలినప్పడు తినాలి గాని దానిని కొట్టి తినకూడదు. ఈ విషయాలు పాండవులకు తెలియదు. చెట్టు కాయలను కొట్టిన విషయం ఎవరో రోమమహర్షికి చెపుతారు. చెట్టు కాయలను కొట్టినందుకు పాండవులను శపించటానికి రోమమహర్షి బయలుదేరతాడు. పాండవులకు దిక్కుతోచక కృష్ణుడిని ప్రార్థిస్తారు. పాండవులకు దేవుడు, గురువు, బంధువు అన్నీ కృష్ణుడే. అమ్మ బిడ్డలను ఎలా చూస్తుందో అలా జీవితం పొడుగునా పాండవులను చూసాడు. కృష్ణుడు మరణించినప్పడు అర్జునుడు మిగిలిన అన్నదమ్ములతో మన అమ్మ చనిపోయింది అని చెపుతాడు. కృష్ణుడు పాండవుల దగ్గరకు వెళ్ళటం మానివేసి రోమమహర్షి దగ్గరకు వెళతాడు. రోమమహర్షి కృష్ణుడిని గౌరవిస్తాడు. తరువాత మహర్షితోపాటు కృష్ణుడు పాండవుల దగ్గరకు వెళతాడు. మొదట కృష్ణుడు పాండవులకు నమస్కారం చేస్తాడు. కృష్ణుడు అంతటివాడు నమస్కారం పెడుతున్నాడు వీరు ఎంత గొప్పవారో అని మహర్షికూడా పాండవులకు నమస్కారం చేస్తాడు.

రోమమహర్షిచేత నమస్కారం పెట్టించటానికి కృష్ణుడు వేసిన ఎత్తుగడ ఇది. తరువాత వీరు మా బావలు, పాండవులు అని రోమమహర్షికి పరిచయం చేస్తాడు. పరమాత్మ నమస్కారం చేసిన వారికి మనం శాపం ఇవ్వటం ఏమిటి అని రోమమహర్షి అనుకొని ఆ పండ్లు తినండి రాలినప్పడే ఈ పండ్లు తినాలి, మీరు వాటిని కొట్టితిన్నా రాలినపండును తినటం వలన ఏ ఫలితం వస్తుందో మీకుకూడా అదే ఫలితం వస్తుంది అని వారితో చెప్పి వారితో పండ్లు తినిపింప చేసాడు. అది కృష్ణుడి మాయ. శపించటానికి వచ్చిన వాడిచేత నమస్కారం పెట్టించాడు వాడు దేవుడు.

నీకు వచ్చిన కష్టసుఖాలను, రాగద్వేషములను నిగ్రహించుకొంటూ ఉంటే, ఎప్పటికప్పడు నీ మనస్సును సమానంగా ఉంచుకొంటే నీకు తెలియకుండానే మహా వెలుగులోనికి జారిపోతూ ఉంటారు. నింద, స్తుతి మనస్సుకే. దేహాభిమానం ఉంటే నింద, స్తుతి దేహాభిమానం లేనివాడికి నిందలేదు, స్తుతి లేదు. ఉపాధినిబట్టి జ్ఞానం రాదు. స్వభావాన్నిబట్టి జ్ఞానం వస్తుంది. నీకు సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా, అశాంతి వచ్చినా, సంతోషం వచ్చినా అన్నీ తలంపులే. నీ హృదయంలో ఉన్న వస్తువుకు తలంపులు లేవు. తలంపులు లేని వస్తువు నీకు అనుభవంలోనికి వచ్చేవరకూ తలంపులు వస్తూనే ఉంటాయి. చనిపోయినవాడు పుడతాడు, పుట్టినవాడు చనిపోతాడు. దీని గురించి దుఃఖపడటం ఎందుకు? కాలాన్ని ఎందుకు వ్యర్థం చేసుకొంటావు. అసలు వస్తువును తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. మీ ఇంట్లో ఎవరైనా పుడితే చనిపోయే రోజు నిర్ణయం అయిపోయి ఉంటుంది, మీ ఇంట్లో ఎవరైనా చనిపోతే వాడు ఎక్కడో ఒకచోట పుడతాడు. ఇవి రెండూ కామన్‌గా జరిగే విషయాలు. వాటి గురించి నీ తలకాయ పాడుచేసుకొంటావు ఎందుకు. బతికున్నవారి గురించి బాధపడకు, చనిపోయినవారి గురించి దుఃఖపడకు. నిన్ను ఎవరైనా స్తోత్రం చేయవచ్చు, నిందించవచ్చు వాటిని సమానంగా తీసుకోలేకపోతే నీవు సహజస్థితికి దూరమవుతావు. నీ గురించి నీకు ఒక అంచనా ఉండాలి. ఇతరులు నీ గురించి ఏమనుకొంటున్నారు అనేదికాదు. నిందను, స్తుతిని నిగ్రహించుకోగలిగితే నీవు సహజస్థితికి దగ్గరవుతావు. జీర్ణం అయిన అన్నం మిమ్మలను బాధపెట్టదు కాని జీర్ణం అవ్వని అన్నం మిమ్మలను బాధపెడుతుంది. అలాగే నేను చెప్పిన మాటలు మీకు అర్థమయితే అవి మీకు ఆనందాన్ని ఇస్తాయి, అర్థంకాని మాటలు గందరగోళం తీసుకొని వస్తాయి.

కోరిక నేరవేరినప్పడు నీకు ఆనందం కలుగుతుంది. ఆనందం కోరిక నెరవేరటం వలన రావటం లేదు, ఆ వస్తువులోనుండి రావటంలేదు. కోరిక నేరవేరినప్పడు నీ మనస్సు హృదయంలోనికి వెళుతుంది. అక్కడ సుఖం ఉంది కాబట్టి అది దానికి అందుతుంది. నీవు కావాలని నీటిలో దిగినా, ఎవరైనా నిన్ను గెంటితే నీటిలోపడిన నీరు నిన్ను తడుపుతుంది. ఎందుచేతనంటే అది దాని స్వభావము. కావాలని పడలేదు, ఎవరో నన్ను గెంటారు నన్ను

తడపవద్దు అంటే నీరు తడపటం మానదు. అలాగే నీ ప్రయత్నం వలన అయినా, గురువు అనుగ్రహం వలన అయినా ఏదో విధంగా హృదయగుహలో పడ్డావనుకో అక్కడ ఉన్నది శాంతి, ఆనందమే కాబట్టి అది నీకు అందుతుంది. బాహ్య విషయాలలో సుఖం కోరుకొంటున్నావు అనుకో దాని వెనకాలే దుఃఖం వచ్చేస్తుంది. లోకానికి సంబంధించిన ఏ భోగం కోరిన దుఃఖం దాని వెనకాలే వస్తుంది అని అర్థం చేసుకొని ఆ భోగాన్ని కోరుకో, నీకు అర్థం కాకపోయినా దుఃఖం వచ్చితీరుతుంది. మనందరకు భోగం కావాలి, దుఃఖం అక్కరలేదు. కాని భోగవాంఛ ఉంది అనుకో నీకు దుఃఖం అక్కరలేదు అన్నా వచ్చేస్తుంది, పైగా కిరీటం పెట్టుకొని నీ వెనకాలే వస్తుంది, దానినుండి నీవు తప్పించుకోలేవు, తప్పనిసరిగా దుఃఖం వచ్చితీరుతుంది. శారదామాత శరీరం విడిచిపెట్టే సమయంలో మూడు మంచి మాటలు చెప్పండి అని శిష్యుడు అడిగితే సహనం, సహనం, సహనం అని చెప్పింది. ఒకే పదాన్ని మూడుసార్లు చెప్పింది. నీవు సహనాన్ని అభ్యాసం చేస్తూ ఉంటే రాగద్వేషముల యొక్క వేగాన్ని తట్టుకొనే శక్తి వస్తుంది. అప్పుడు నీ మనస్సు బాహ్య ముఖానికి రాదు. ఎవరితోటి అతిగా స్నేహం చేయవద్దు, అలాగ చేసావు అనుకో వారు సడన్‌గా విరోధులు అయితే నీ బ్రెయిన్ అప్‌సెట్ అవుతుంది. మరల నీ బ్రెయిన్ కండిషన్‌లో పడటానికి చాలాకాలం పడుతుంది.

మనస్సులో ఎన్ని రోగాలు ఉన్నా, ఎన్ని బలహీనతలు ఉన్నా కంగారుపడవద్దు. అవి తగ్గిపోయే మందు ఉంది. మందు చేతిలో ఉంటే దేహానికి రోగం వచ్చినా ఫరవాలేదు. అలాగే నీ మనస్సులో ఉన్న రుగ్మతలను తొలగించే మందు ఉంది. ఆ మందు ఏమిటి అంటే భగవంతునితో అనుబంధాన్ని జీవితం పొడుగునా కాపాడుకో, నీ ముక్కులో గాలి తిరుగుతున్నంత కాలం భగవంతుని మీద విశ్వాసం విడిచిపెట్టకుండా ఉంటే నీ మనస్సులో ఉన్న రుగ్మతలు అన్నీ పోతాయి. నీ శరీరం స్మశానంకు వెళ్ళే వరకు భగవంతునిమీద విశ్వాసం విడిచిపెట్టవద్దు. అప్పుడు నీ బాధ్యతలు అన్నీ భగవంతుడు తీసుకొంటాడు. నీవు ఎవరి గురించి అయినా కంగారు పడుతున్నావు అనుకో వారి క్షేమం కూడా ఆయనే చూసుకొంటాడు, ఎప్పుడు? ఆయన మీద నీకు సజీవమైన విశ్వాసం ఉన్నప్పుడు. ఇది శరీరంలో రోగం తగ్గటానికి మందుకాదు నీ మనస్సులో ఉన్న రుగ్మతలను తొలగించే మందు. మనం రోజుకు పది అవతారాలు ఎత్తుతాము, హెచ్చుతగ్గులుగా ఉంటాము. అలాకాకుండా నీ శరీరంలో ప్రాణం పోయేవరకు భగవంతుని మీద సజీవమైన విశ్వాసం కాపాడుకో. అందులో హెచ్చుతగ్గులు ఉండకూడదు. అప్పుడు అంతా ఆయనే చూసుకొంటాడు. ఆవుకు దూడ పుట్టగానే దూడమీద ఉన్న మాయను ఆవు నాకేస్తుంది. అది దాని బిడ్డ కాబట్టి దానికి వెలపరం ఉండదు. అలాగే మనం ఈశ్వరుడి బిడ్డలం కాబట్టి మనలోని వాసలను, బలహీనతలను ఆయన నాకేస్తాడు. ఎప్పుడు నాకుతాడు అంటే నీ శ్వాస పోయేవరకు ఆయనమీద విశ్వాసం నిలబెట్టుకొంటే మీలో ఉన్న దోషాలను ఆయన నాకేస్తాడు. అందువలన శ్వాసపోయేవరకు ఈశ్వరునిమీద విశ్వాసం కాపాడుకో. మిగతావి అన్నీ అవేపోతాయి. అంతా ఆయనే చూసుకొంటాడు.



05-05-2001

దేహముతో తాదాప్యం
పొందేవాడు బద్ధుడవుతాడు.
పరమాత్మతో తాదాప్యం
పొందేవాడు ముక్తుడవుతాడు.

ఏది మనముగా ఉన్నామో అది
మనకు వ్యక్తమయ్యే వరకు
మనం కాని దానిని మనం అని
అనుకొంటూనే ఉంటాము.